

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

ఏక్ దో తీన్ ఆజా మౌసం హై రంగీన్
రాత్‌కో చుప్ చుప్ కే మిల్‌నా
దునియా సంఝే పాప్ రే
ఏక్ దో తీన్ ఆజా మౌసం హై రంగీన్

'ఆవారా' సినిమాలోని ఈ పాట, సినిమాలో అంతగా ప్రాధాన్యం లేని క్లబ్ పాట. కానీ సినీ గేయ ప్రపంచంలో మాత్రం ఒక అత్యద్భుతమైన ట్రెండ్ సెట్టింగ్ పాట. అది స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లు. బ్రిటిష్ వాళ్ల నుంచి భారతదేశం రాజకీయంగా విముక్తం అయింది కానీ మానసికంగా కాలేదు. ఇందుకు తిరుగులేని ఉదాహరణగా నిలుస్తాయి ఆకాలంలోని సినిమాలలోని క్లబ్బు పాటలు. క్లబ్బు పాటలను సినిమాలలో ప్రవేశపెట్టింది రాజ్‌కపూరే.

భారతీయ చలనచిత్రాలలో తొలి క్లబ్బు పాటగా 'బర్సాత్'(1949) సినిమాలోని 'పత్లి కమర్‌హై, తిర్చినజర్‌హై' పాటను పరిగణించవచ్చు. బ్రిటీష్ రాజ్యంలో క్లబ్బుకు వెళ్ళటం అన్నది అప్పర్ క్లాస్ వ్యక్తి అనటానికి నిదర్శనం. సాధారణంగా బ్రిటీష్ అధికారులకు, పెద్దలకూ మాత్రమే క్లబ్బుల్లో ప్రవేశం ఉండేది. భారతీయులకు ప్రవేశం ఉండేది కాదు. ఒకవేళ భారతీయులకు ప్రవేశం ఉంటే రాజులకు, మహారాజులకు, జమీందార్లకు మాత్రమే ప్రవేశం ఉండేది. అంటే బ్రిటీష్ కాలంలో 'క్లబ్బు' ఒక 'స్టేటస్ సింబల్' అన్నమాట. అయితే సమాజంలో క్లబ్బులకు వెళ్లే వాళ్లు 'గొప్పవాళ్లు' అన్న గౌరవం ఉండేది. దానితో పాటు క్లబ్బులకు వెళ్లే భారతీయులు చెడిపోయినవారు, పూర్తిగా భారతీయతను వదలి ఆంగ్లేయుల పద్ధతులను స్వీకరించిన వారు అన్న అభిప్రాయం నెలకొని ఉండేది. 'బర్సాత్' లోని 'పత్లికమర్‌హై' పాట ఈ భావాన్ని అతి చక్కగా ప్రదర్శిస్తుంది.

బర్సాత్ సినిమాలో ప్రేమ్ నాథ్ పాత్ర ప్రేమను నమ్మని పాత్ర. ఆ పాత్రకు ప్రేమపట్ల పవిత్ర భావనలేదు. చులకన భావన అధికం. ముఖ్యంగా అమ్మాయిలంటే చులకన అభిప్రాయం. అతడు ఓ పల్లెటూరి అమ్మాయితో సన్నిహితంగా ఉంటాడు. ఆమె దృష్టిలో అది ప్రేమ. ఇతని దృష్టిలో ఆమెతో ఒక అనుభవం మాత్రమే. ఆమె పట్ల ప్రేమ ఉండదు. అనుబంధం ఉండదు. ఆమె మనసున్న ఒక మనిషి అన్న స్పృహ ఉండదు. ఆమెకు మాత్రం ఇతడే లోకం. దాంతో ఎంతకీ రాని అతడిని వెతుకుతూ ఆమె పట్నానికి వస్తుంది. (తరువాత ఇదే కథను మొత్తం సినిమాగా 'రాం తెరీ గంగా మైలి' అనే సినిమాగా రూపొందించాడు రాజ్‌కపూర్). ఆ సందర్భంలో వస్తుందీపాట. భారతీయ చలనచిత్రంలో తొలి క్లబ్బు పాట.

ప్రేమ్ నాథ్ పాత్ర క్లబ్బులో పాశ్చాత్య బాణీకి అమ్మాయిలతో నృత్యం చేస్తూ పాడుతూంటుంది. అదే సమయానికి అతడి ప్రేయసి అతడిని వెతుక్కుంటూ వస్తూ విషాదంగా పాట పాడుతూంటుంది.

ఇక్కడ పాట చిత్రీకరణలో చమత్కారం ఏమిటంటే, క్లబ్బులో పాశ్చాత్య బాణీకి నృత్యం చేస్తున్నవాడు చెడ్డవాడు. అతడిని వెతుకుతూ భారతీయ బాణీలో పాటపాడే అమ్మాయి మంచిది. అంటే, ఆ కాలంలో క్లబ్బులకు వెళ్లే భారతీయులు మంచివారు కారు అన్న అభిప్రాయాన్ని బలపరుస్తోందన్నమాట పాట. దీనికి తగ్గట్టు శంకర్ జై కిషన్‌లు రెండు పాటలను అతి చక్కగా మిళితం చేసి ఒకే పాటగా మలిచారు. తొలి 'ఫ్యూజన్ పాట' అనవచ్చు దీన్ని. తరువాత 'ఆవారా'లో మూడు విభిన్నమైన పాటలను ఒక పాటగా గుదిగ్రుచ్చి అత్యద్భుతమైన 'పాట'గా మలిచాడు శంకర్ జై కిషన్. భారతీయ చలనచిత్ర చరిత్రలో తొలి 'కల' పాట అది.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే క్లబ్బుపాట అయినా గేయరచయితలు పాటలను అత్యంత సున్నితంగా రచించారు. 'పత్లికమర్ ' అయినా 'ఏక్ దో తీన్ ' అయినా ఎలాంటి అశ్లీలం, దంద్వార్థం పొడసూపకుండా పాత్రల వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తూ, సందర్భోచితంగా పాటను సృజించారు.

**పత్లికమర్ హై, తిర్చి నజర్ హై**

**ఖిలే ఫూల్ సీ, తెరీ జవానీ**

**కొయీ బతాదే కహా కసర్ హై**

'సన్నని నడుము, వాలుకన్నులు, పూవులా విరిసిన యవ్వనం, ఎక్కడా ఎలాంటి లోపం లేదు. ఏమైనా ఉందేమో ఎవరయినా చెప్పండి' అని ఛాలెంజ్ చేస్తున్నాడు పాటలో. దీనికి ముందు పాశ్చాత్య బాణీ వస్తుంది. ఈ బాణీ ఆధారంగా తరువాత ఓ సంగీత దర్శకుడు పాటను సృజించాడు కూడా.

ప్రేమనాథ్ పాత్ర పాశ్చాత్య వాయిద్యాలతో, పాశ్చాత్య ఫక్కీలో అమ్మాయి సౌందర్యాన్ని మాత్రం వర్ణిస్తూ పాడతాడు. అంటే అతడి దృష్టి భౌతికానికి పరిమితం అని గేయ రచయత సూచిస్తున్నాడన్నమాట. వెంటనే పాట బాణీ మారుతుంది. పాట విషాద భరితం అవుతుంది. బాణీ, వాయిద్యాలు సాంప్రదాయకం అవుతాయి. పాటలో పదాలు కూడా మారతాయి.

**ఆజామెరే మన్ చాహే బాలం**

**ఆజా తెరా ఆఖోమే ఘర్ హై**

రెండు విభిన్నమైన బాణీలను కూర్చి పల్లవి తయారయింది. ప్రేమనాథ్ పాడిన భాగం పూర్తికాగానే లతామంగేష్కర్ పాడిన భాగం పాడకపోతే పల్లవి పూర్తయిన భావం కలగనివిధంగా పల్లవి ఏర్పాటయింది. ఒకటి పాశ్చాత్యం మరొకటి భారతీయం. ఒకటి ఆనందం. మరొకటి విషాదం. ఒకటి భౌతికం. మరొకటి ప్రేమతత్వం. ఆమె అతడిని రమ్మని ప్రార్థిస్తోంది. ఎందుకంటే ఆమె కళ్లల్లో అతడి ఇల్లు ఉందట. ఇదొక ఫ్రేజ్. కళ్లల్లో ఇల్లుండటం అంటే ఆమె హృదయంలో అతడు గూడు కట్టుకుని ఉన్నాడని. కళ్లు ఆత్మను ప్రదర్శిస్తే ఆమె ఆత్మ అతడికి అంకితం అయిందని అర్థం.

**మై చంచల్ మద్ మస్త్ పవన్ హు**

**ఘూం ఘూం హర్ కలీ కొ చూము**

ఇక్కడ ప్రేమ్ నాథ్ పాత్ర వ్యక్తిత్వాన్ని ప్రేమపట్ల అతడి అభిప్రాయాన్ని ప్రదర్శిస్తున్నాడు గేయరచయత. అతడు 'మద్ మస్త్ చంచల్ పవన్' అంటే చంచలమైన వాయు వీచిక. ఒక తేనెటీగ వంటివాడు. ప్రతిపూవునుండి మకరందాన్ని పొందాలని తహతహలాడతాడు.

అతడు ఇది పాడగానే  బాణీ మారుతుంది. నిమ్మి పాత్ర పాటను అందుకుంటుంది. ఇది ఎంత స్వాభావికంగా జరుగుతుందంటే అలా జరగకపోతే రసభంగం అయిన భావన కలుగుతుంది.. కానీ ఇక్కడ రసాన్నే మార్చేస్తోంది పాట. అదీ కళాకారుల గొప్పతనం.

**బిఛడ్ గయా మై ఘాయల్ హిరణీ**

**తుంకో దూంఢూ, బన్ బన్ ఘూమూ**

ఆమె గాయమైన లేడి. అతడికి దూరమై అతడిని వెతుకుతూ తిరుగుతోంది. మళ్లీ వెంటనే విరుద్ధమైన భావనను కలిగిస్తుంది పాట. అతడు పాడతాడు.

**మెరీ జిందగీ మస్త్ సఫర్ హై**

అతడి జీవితం ఒక ఆనందకరమైన ప్రయాణం అంతే.. ఈ ఒక్క వాక్యం చాలు అతడి వ్యక్తిత్వాన్ని ఆలోచన ధోరణిని తెలపటానికి. పాట పాశ్చాత్యం భౌతికం నుంచి భారతీయం ప్రేమతత్వం వైపు అటూ ఇటూ గంతులేస్తూంటుంది. కానీ వింటూన్న శ్రోతకు ఈ విరుద్ధ భావనలు ఒకే నదీ ప్రవాహంలా అనిపిస్తాయి. అద్భుతమైన ఫ్యూజన్ సంగీతం ఇది.

**తుం బిన్ నైనోంకీ బర్సాత్**

**రోక్ న పావూన్ , లాఖ్ మనావూ**

మొదటి చరణం పాశ్చాత్యంతో అంతమయింది. అందుకని రెండో చరణం విషాదంతో సాంప్రదాయబద్ధమైన బాణీతో ఆరంభమయింది. ఆమె కళ్లనుండి వర్షంలా కన్నీటి ధార కారుతోంది. ఎంత ప్రయత్నించినా ఆగటంలేదు. వెంటనే పాట మళ్లీ ప్రేమ్నాథ్ పాత్రవైపు దూకుతుంది.

**మై బహతీ దరియా కా పానీ**

**ఖేల్ కినారోంసే బడ్ జువూ**

**బంధ్ నా పావూ,**

**నయా నగర్ నిత్ నయీ డగర్ హై**

అతడు ప్రవహించే నది నీరు. ఒడ్డును ఒరుసుకుని దాటి ప్రవహిస్తాడు. అతడికి అడ్డూ అదుపు లేదు. ఎవ్వరూ అడ్డుకోలేరు. ప్రతిరోజూ అతడికి కొత్తనగరం. కొత్తదారి. అంటే రోజుకో నూతనానుభవం అన్నమాట. ఇదీ అతడి జీవితం. ఇది తొలి క్లబ్బు పాట. అయితే పాశ్చాత్య క్లబ్బు పాట. పాశ్చాత్య వాయిద్యాలు, సూటూ, బూటూ వేసుకున్న వ్యక్తులుంటారు. నృత్యం  కూడా పాశ్చాత్యమే. భావం కూడా పాశ్చాత్యుల భావమే. బంధనం లేదు. ప్రేమలేదు. అనుబంధం లేదు. జీవితం సర్వం ఆనందమైన అనుభవాల సమాహారం అన్న hedonistic భావన తప్ప మరొకటిలేదు.

ఆవారాలో క్లబ్బు పాశ్చాత్యుల క్లబ్బు కాదు. కానీ ఆ ప్రభావంతో ఏర్పడిన దొంగలు, గూండాల క్లబ్బు. అంటే దాన్లో దొంగలు, నీచులు, తక్కువ స్థాయివారు తప్ప మర్యాదకల మనుషులెవరూ రారు. హిందీ సినీగీతాలలో తొలి భారతీయ క్లబ్బుపాట అన్నమాట 'ఏక్ దో తీన్ 'పాట. ఇందులో పొట్టి బట్టలు వేసుకున్న అమ్మాయిలు తాగుబోతులు, సిగరెట్ పొగల మధ్య నృత్యం చేస్తూ పాట పాడతారు. అప్పటికి ఇంకా 'కేబరే' పాట రంగ ప్రవేశం చేయలేదు.

నిజానికి 'ఆవారా'లో ఏక్ దో తీన్ పాట సందర్భం కేవలం నాయకుడు, విలన్‌తో కలవటం. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూపించేందుకు వస్తుందీపాట. అందుకని గేయరచయిత పాటను వీలయినంత సరళంగా గూఢార్థాలు, నిగూఢార్దాలతో  రాశాడు. పాట

మొత్తం వేగంగా సాగుతుంది. క్లబ్బు పాట కాబట్టి పాశ్చాత్య వాయిద్యాలు, బాణీలు ఉంటాయి. 'ఏక్ దో తీన్ అన్నది మౌసం హై రంగీన్ 'తో ప్రాసకోసం వేసిందే తప్ప ఎలాంటి అర్థం పరమార్థంలేదు. వాతావరణం హాయిగా ఉందంటోంది అంతే. రాత్రిపూట దొంగతనంగా కలవటం ప్రపంచం తప్పు అంటుంది  అంటోంది.

**యే మద్ మస్త్ జవానీ హై, తెరె లియే యే దీవానీ హై**

**డూబ్‌కె ఇస్ గెహరాయీమే, దేఖ్ లె కిత్నా పానీ హై.**

నృత్యం చేస్తూ ఆమె నాయకుడిని ఛాలెంజ్ చేస్తోంది. ఆమెది మత్తు కలిగించే యవ్వనం. ఆ యవ్వనం  లోతుల్లో మునకవేసి ఎంత లోతుందో తెలుసుకోమంటోంది. పాడేది క్లబ్బు డాన్సర్. అర్థం చేసుకునే వారికి అర్థం చేసుకున్నంత మహదేవ. నిజానికి పాటలో ఈ పంక్తులు వస్తున్నప్పుడు మనకు పాట సరిగా వినపడదు. క్లబ్బులో వారి నవ్వులు, మాటలు, చర్యల నడుమ పంక్తులు వినబడవు. బహుశా అలా సెన్సార్ నుంచి తప్పించుకుని ఉండవచ్చు. కానీ ఆ సందర్భంలో ఆ క్లబ్బులో ఈ పాటకు అంత ప్రాధాన్యం లేదని స్పష్టం చేస్తుంది ఆ దృశ్యం. రెండవ చరణానికి హీరో దగ్గరకు ఆమె వస్తే అతడు ఆమెని తోసేస్తాడు.

**క్యా తూ ముఝే ఠుకరాతా హై**

**ముఝసె నజర్ క్యా చురాతా హై**

**లూట్ యె దునియా తేరీ హై**

నన్నెందుకు తిరస్కరిస్తున్నావు? నన్ను చూసి ముఖం తిప్పుతుంటున్నావు. ఈ ప్రపంచం నీదే. దీన్ని దొంగిలించు. ఈ రెండు పాటలు రాసింది శైలేంద్ర. సంగీతం శంకర్ జై కిషన్. రెండూ రాజ్‌కపూర్ సినిమాలే.

ఇదీ భారతీయ చలన చిత్ర సంగీత చరిత్రలో తొలి క్లబ్బు పాట. 'పత్లికమర్‌హై' సగం క్లబ్బు, సగం బయట జరుగుతుంది. అలాకాదీపాట కాబట్టి తొలి క్లబ్బుపాట అయింది. పూర్తిగా సిగరెట్ పొగలు, మాటలుఅరుపులు , కేకలు, దొంగలు, బీదలు ఉండే క్లబ్బు అన్నమాట. మన సినిమా వాళ్ల దృష్టిలో అప్పటి నుంచీ హైక్లాస్ క్లబ్బులు, లోక్లాస్ క్లబ్బులు అన్న విభజన ఏర్పడింది. హైక్లాస్ క్లబ్బుల్లో పాశ్చాత్య పాటలు, వాయిద్యాలు ఉంటాయి. లోక్లాస్ క్లబ్బుల్లో నీచస్థాయి వాళ్లు ఉంటారు. ఈ అభిప్రాయాన్ని స్థిరపరచి క్లబ్బుల గ్రామర్ ఏర్పరచింది జాల్ సినిమాలో 'సాహిర్ లూధియాన్‌వీ' పాట.

**తద్బీర్ సే బిగ్డీహువీ తక్దీర్ బినాలే**

**అప్నే సే భరోసా హైతో దావ్ లగాలే...**

తెలివిని ఉపయోగించి, సమస్యను పరిష్కరించి అదృష్టాన్ని సవరించుకో. నీపై నీకు నమ్మకం ఉంటే ఎత్తువేయి. ఛాలెంజ్ స్వీకరించు.

ఇది క్లబ్బు పాట. దేవ్ ఆనంద్ పాత్ర నిరాశ చెంది క్లబ్బు నుంచి వెళ్లిపోతూంటే గీతాబాలి పాత్ర గిటార్ వాయిస్తూ పాట పాడుతుంది.

ఈ దృశ్యం ప్రేక్షకుల మనస్సుల్లో ఎంతగా ముద్రవేసిందంటే ఆపై సినిమాల్లో క్లబ్బు పాటలు తప్పనిసరి అయ్యాయి. నిజానికి ఈ పాట సాహిర్ సినిమాకోసం రాయలేదు. అతను వ్యక్తిగతంగా రాసుకున్న 'గజల్. దాన్ని సంగీత దర్శకుడు ఎస్డీ బర్మన్ క్లబ్బు పాటగా మలిచాడు. దాంతో ఆగ్రహించిన సాహిర్ ఎస్డీబర్మన్‌తో ఇక పనిచేయనని, ఆ సినిమాకు పాటలు రాయనని భీష్మించుకున్నాడు. గీతాబాలి, గీతా దత్ లు అతడిని ఒప్పించారు. దాంతో ఎస్డీ బర్మన్, సాహిర్  కలయికలో భవిష్యత్తులో అద్భుతమైన పాటలు అందాయి. లేకపోతే ఇదే వారిద్దరి కలయికలోని చివరి పాట అయి ఉండేది. ఎందుకంటే సాహిర్ కూడా అదృష్టాన్ని నమ్మేవాడు కాదు. స్వంత శక్తితో సర్వం సాధించుకోవచ్చనే అత్యంత ఆత్మవిశ్వాసం కలవాడు.  ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. తన మాటే చెల్లాలనే పట్టుదల కలవాడు. అది ఈ పాట ప్రతిఫలిస్తుంది.

**దర్ తా హై జమానేకీ నిగాహేం సె భలా క్యా?**

**ఇన్సాఫ్ తేరే సాథ్ హై ఇల్జాం ఉఠాలే....**

ప్రపంచాన్ని చూసి భయపడతావెందుకు? సత్యం నీతో ఉన్నప్పుడు ఎవరు ఎలాంటి నేరం మోపినా భయపడతావెందుకు? సత్యం నీతో ఉన్నప్పుడు ఎవరు ఎలాంటి నేరం మోపినా భయపడాల్సిన పనిలేదు.

**క్యాఖాక్ వో జీనా హై జో అప్నే లియే హో**

**ఖుద్ మిట్ కే కిసీ ఔర్ కో మిట్‌నేసే బచాలే**

తనకోసం మాత్రమే జీవించే జీవితం వ్యర్థం. తాను నాశనం అయికూడా ఇతరులు నాశనం కాకుండా చూడాలి.

**టూటీ హువే పత్వార్ హై కష్తీ తో గం క్యా**

**హారీ హువీ బాహోంకో హీ పత్వార్ బనాలే.**

పడవ తెడ్డు విరిగిందని బాధపడకు. నీ చేతులనే తెడ్డులాగా మార్చి ఉపయోగించు.ఇది క్లబ్బు పాటలకు ప్రామాణికత నిచ్చి సినిమాల్లో క్లబ్బు పాటలు సినిమా విలువను పెంచే స్థాయికి ఎదిగించిన అసలైన 'క్లబ్బు గజల్'. అందుకే తరువాత ఓ సినిమా మొత్తం ఏకంగా క్లబ్బులోనే అధికశాతం జరుగుతుంది. ఆ సినిమాలోని మూడు క్లబ్బు పాటలూ సాహిర్ అత్యద్భుతమైన రీతిలో రచించాడు. ఆ సినిమా సూపర్ హిట్ అవటంతో తరువాత క్లబ్బుల పాటలు సినిమాల్లో తప్పనిసరి అయ్యాయి.

*(వచ్చే నెల మళ్లీ)*

Post your comments